# అందాల ఆనందం

"మమ్మీ, ఈ రోజు నాకూ సరోజకు లక్ష్మి అంటీ వేస్తుందే అలా వెయ్యవా జడా?" గారాబంగా అడిగింది సరస్వతి.

"నీకలా బాగుండదమ్మా. సరోజకు నీలా పొడుగు వెంట్రుకలు లేవని లక్ష్మి ఆంటీ అలా వేస్తుంది. నీకు చక్కగా పొడుగాటి వెంట్రుకలు కదా. ఇలాగే బాగుంటుంది" అనునయంగా కూతురుకి చెప్పింది వసంత.

"నువ్వెప్పుడూ అలాగే చెప్తావ్" అని బుంగమూతి పెట్టికోపంగా స్నానానికి వెళ్ళింది సరస్వతి.

"ఛీఛీ? ఆ పొరుగుబొట్టు ఏమిటి? ముందు వెళ్ళి మళ్ళీముఖం కడుక్కుని చక్కగా గుండ్రంగా బొట్టు పెట్టుకుని వెళ్లు" మందలించింది వసంత.

అమ్మకు ఎదురు చెప్పే ధైర్యం లేక మౌనంగా వెళ్ళి ఆమె చెప్పిన ప్రకారం తిలకం దిద్దుకుని స్కూలుకి బయల్దేరింది సరస్వతి.

"సరస్వతీ తలంటి పోసుకుని కళ్ళకు కాటుక పెట్టుకోవాలి. ఇలారా కాటుక పెట్టించుకుని వెళ్దువు" అంటూ పిలిచింది వసంత.

కాటుక పేరు వినగానే గబగబా స్కూలుకి పరుగెత్తింది సరస్వతి

"పిచ్చి మొద్దు కాటుకంటేనే భయపడిపోతుంది. ఏ పూటైనా కాటుక పెట్టించుకోవాలంటే గందరగోళం చేస్తుంది' మనసులోనే అనుకుని ఇంటి పనిలో నిమగ్నమయింది వసంత.

"సరూ నీకు లేతరంగు డ్రెస్సుల కంటే ముదురురంగువే ఎక్కువ బాగుంటాయి. మొన్న వేసుకు వచ్చిన స్నఫ్‌కలర్ డ్రెస్ నీకెంత బాగుందో తెలుసా?... సూపర్బ్" సరస్వతి ఒడిలో పడుకుని ఆమె ముంగురులను సవరిస్తూ అన్నాడు శరత్.

"ఇంకా ఏమిటో దొరగారి కోరికలు? చెప్తే రేపట్నుంచి అలానే అన్నీ తమరి ఇష్ట ప్రకారం అలంకరించుకుంటాను" అతని కళ్ళలోకి కొంటెగా చూస్తూ అన్నది సరస్వతి.

"చేతులకు నిండుగా గాజు లేసుకునే ఆడవాళ్ళంటే నాకు చాలా ఇష్టం. అసలే నువ్వు పచ్చగా మెరుస్తుంటావ్ కదా. నిండు రంగు గాజులు చేతినిండా వేసుకుంటూ ఎంత బాగుంటావో?"

ఇంకా .. "

"అన్నట్లు మరిచిపోయాను. రోజు ఓ ముద్దబంతినో, మందారాన్నో తురుముకువస్తావు గాని చక్కగా మూరెడు మల్లెలు పెట్టుకుని ఆ సువాసనతో నన్ను ముంచెత్తరాదూ? జడ వదులుగా వేసుకుని,

తలలో నిండుగా మల్లెలు పెట్టుకుంటే నీవు చాలా చాలా బాగుంటావ్".

"అవునా?" కళ్లు ఇంతేసి చేసేస్తూ అన్నది సరస్వతి.

'అవునా ఏమిటోయ్? నా మాట విని చూడు అప్సరసలా ఉంటావ్." ఆమె ముఖాన్ని నిశితంగా చూస్తూ అన్నాడు శరత్.

"అన్నట్లు మరిచిపోయాను. తలంటి స్నానం చేసిన రోజున మాత్రమే కాటుక పెట్టుకోవడం నీకు అలవాటనుకుంటాను. అలా కాకుండా ప్రతిరోజూ కాటుక పెట్టుకుంటే కలువరేకుల్లాంటి ఆ కళ్ళు మరింత బాగుంటాయ్. అంతేకాదు అప్పుడప్పుడు నిన్ను ఉడికించా లని నేను ఏదైనా అన్నప్పుడు నీవు చిరుకోపం ప్రదర్శిస్తూ ఆ కళ్ళ చివర్నుంచి అదోరకంగా తమాషాగా చూస్తావే, అలాంటప్పుడు ఆ కళ్ళలో కాటుక చార చాలా అవసరం."

"అయిపోయిందా అయ్యగారి కోరికల పట్టిక? వయ్యారంగా చూస్తూ అన్నది సరస్వతి.

"మరో చిన్న ఎడ్జెస్ట్‌మెంట్ సరూ..." కళ్ళు మూసుకుని ఆమె నుదుటిని స్పృశిస్తూ అన్నాడు శరత్.

"అదిగో ఆ 'బ్రా' లంటే నాకు ఇష్టం ఉండదు. అవి లేకుండా ఉంటే ఎంతో ఇష్టం. అయినా సహజ సంపదలున్న నీకెందుకోయ్ ఇవన్నీ? పైగా అవి లేకపోవటమే ఇప్పుడు ఫాషన్ అనుకుంటా?"

"ఛీ .. ఛీ .. నీవన్నీ వింత కోరికలు మరీ చిలిపితనం ఎక్కువైపోతున్నది దొరగారికి." సిగ్గుపడుతూ అన్నది సరస్వతి.

"నిన్ను చూస్తుంటే చాలు ఎక్కడలేని చిలిపితనమూ వచ్చే స్తుంది. అవును గాని రేపట్నుంచి నేను కోరినట్లుగా అలంకరించు కుంటావు కదూ?" లాలనగా అన్నాడు.

"దొరగారి కోరిక తీర్చటానికేగా నేనున్నది. నీవు అడగటం నేను కాదనటమూనా" అన్నదామె.

ఆ మరుసటి రోజు నుంచి శరత్ కోరికల మేరకు ఆమె అలం కరించుకోవడం ప్రారంభించింది. అతను తనని తృప్తిగా చూస్తుంటే ఎంతో గర్వంగా ఫీలయ్యేది సరస్వతి. అదో అనిర్వచనీయమైన అనుభూతి

"ఇదిగో ఏమిటీ అవతారం? ఆశ్చర్యం ప్రకటించాడు గంగాధరం.

"ఏం నా అవతారానికి? నిక్షేపంగా ఉన్నాను" అని గర్వంగా భర్త వంక చూసింది సరస్వతి.

"సర్సర్లే ఇంకొన్నాళ్ళు పోతే కాశీపోసి చీరకట్టుకుని నాతో సినిమాకి బయల్దేరేటట్టున్నావు నువ్వు" వెటకారంగా అన్నాడు గంగాధరం.

"చాల్లెండి మీరంతా అతి" చిరుకోపంగా అన్నది.

"కాకపోతే ఏంటోయ్ ఆ కొప్పు, ఈ జరీ అంచుచీరె. పాపట్లో ఓ బొట్టు, నుదుట ఓ బొట్టు.... ఏమిటిదంతా పెద్ద ముత్త యిదువలా."

"కాకపోతే నే నింకా పదహారేళ్ళ కన్నెపిల్ల ననుకుంటు న్నారా? ఇద్దరు పిల్లల తల్లిని."

"ఒహెూహెూ ఇద్దరు పిల్లల తల్లివి అయితే అయినావు కాని నాకు మాత్రం ఇంకా పడుచు పెళ్ళానివే ఇవన్నీ జాంతానై. ఈ కట్టుబొట్టు చాదస్తాలన్నీ బంద్. అయినా అంత పెద్దబొట్టు అమ్మ వారిలా కొంచెం సైజు తగ్గించు. చెవులకు ఆ కమ్మలు తీసేసి ఆ లోలాకులు వేసుకో. ఈ జరీ అంచు చీరలన్నీ ఇంకొంతకాలం భద్రంగా దాచిపెట్టుకో. రేపు రెండు నైటీలు తెస్తాను ఇకనుంచి రాత్రిళ్ళు వాటితోనే."

"చాల్లే ఊరుకోండి మీరు" అంటూ సిగ్గుపడిపోయింది సరస్వతి.

సిగ్గుల మొగ్గయిన భార్యను తను కోరుకునే విధంగా ఊహిం చుకుంటూ కౌగిట్లో చేర్చుకున్నాడు గంగాధరం.

భర్త కౌగిలిలో కరిగిపోయింది శ్రీమతి సరస్వతి.

★ ★ ★

"అమ్మా.... అమ్మా? పిలుస్తూనే లోపలికి వచ్చాడు సతీష్

కొడుకు పిలుపుతో గత స్మృతుల నుండి తేరుకున్నది సరస్వతి

"ఏమిటమ్మా ఇంకా ఇలానే ఉన్నావ్? త్వరగా వెళ్ళాలి మనం తొందర చేశాడు సతీష్.

"నాదేముందిరా? మీరూ పిల్లలు త్వరగా తయారుకండి. నా

స్నానం పూర్తి చేశాను. ఇక ఉన్నదాన్ని ఉన్నట్లు వచ్చేయటమే" అన్నది సరస్వతి.

"ఏమిటి ఇలానే వస్తావా? నో నో.. మధూ... మధూ అమ్మకి చీర వగైరాలు సెలెక్టుచేసి రెడీ చేసెయ్ త్వరగా." భార్యను పిలిచి చెప్పాడు సతీష్.

"అవు నత్తయ్యా, మీరు ఈ చీరకట్టుకుని, ఇదిగో ఈ నెక్లెస్ పెట్టుకుని రావాలి" కోడలు పురమాయించింది.

"అవునమ్మా నీ వీ నెక్లెస్ పెట్టుకుని చాలా రోజులయింది. ఈరోజు తప్పకుండా పెట్టుకోవాల్సిందే" చిన్న కూతురు బలవంతం చేసింది.

"నాకెందుకురా ఇవన్నీ? చిన్న పిల్లలు మీరు పెట్టుకుంటే బాగుంటుంది కాని" ఇబ్బందిగా అన్నది సరస్వతి.

"పోనీలేవోయ్, పిల్లలేదో ముచ్చట పడుతున్నారు వాళ్ళ మాట ఎందుకాదనాలి" అంటూ గదిలోంచి బయటకు వచ్చాడు గంగాధరం.

చాలా సంవత్సరాల తగవాత సూటూ, బూటూ వేసుకున్న భర్త వంక విస్మయంగా చూస్తూ ముక్కుమీద వేలేసుకుంది సరస్వతి.

ఏమిటో తెలిసీ తెలియని వయసులో అమ్మ తన కోరిక ప్రకారం ముస్తాబు చేసేది. ఆ తర్వాతైనా నా ఇష్టప్రకారం అలంక రించు కుందామంటే కాలేజీ రోజులు ప్రాణంగా ప్రేమించిన శరత్

కోసం అతని కోరిక ప్రకారం అలంకరించుకోవటం అయింది.
అదంతా ఓ కలలా ముగిసిం తర్వాత గంగాధరంతో పెళ్ళి, పెళ్ళా
య్యాక భర్త ఇష్టం ప్రకారం కటుకునే చీర దగ్గర్నుంచి కళ్ళ
కాటుక వరకూ అయన ఇష్టాన్ని కాదనలేదు. ఇప్పుడు ఈ వయసులో
పిల్లల బలవంతం మీద వాళ్ళ మనసు కష్టపెట్టటం ఇష్టం లేక
ఇలా.... అయినా ఇందులో ఉన్న ఆనందం, తృప్తి. 'కనీసం' కట్టు
కునే బట్టల విషయంలో కూడా ఆడదానికి స్వేచ్ఛా స్వాతంత్ర్యా
ల్లేవా అనుకునే ఈ కాలం ఆడపిల్లలకు ఏం తెలుస్తుంది? వాళ్ళకి
ఎలా చెప్తే తెలుస్తుంది? మనసులోనే అనుకుంటూ పిల్లల కోరిక
మేరకు ముస్తాబై కుటుంబ సమేతంగా తీయించుకోవాలన్న గ్రూప్
ఫొటో కోసం స్టూడియోకు బయల్దేరింది సరస్వతి-కాదు సరస్వతమ్మ.